# దశమగ్రహం

**- హోతా పద్మినీదేవి**

గత ఆరునెలలుగా తన చిన్న అల్లుడు చంచ్రలావు పెద్ద సమస్యగా మారి కూర్చున్నాడు పరంధామయ్యకి. పెళ్లిలో అలకపాన్పు మీద అతను అడిగిన స్కూటర్‌ని పెళ్లయి రెండునెలలయినా తను ఇవ్వలేదని కూతురిని పుట్టింటికి పంపేసినప్పుడు అర్థమయిందాయనకి అల్లుడు కొరకరాని కొయ్య అని. హితోక్తులతో అతనిలో మార్పు తేవాలనుకున్నాడు.

“స్వార్జితం ఇచ్చిన తృప్తి, ఆనందం ఎవరో ఇచ్చినదానిలో ఉండదు. కానుక అంటే అడిగి పుచ్చుకునేది, పీడించి పుచ్చుకునేది కాదు. ఆశీస్సులతో ఇచ్చేది. ‘ఉత్తమం స్వార్జితం, మధ్యమం ప్రితార్జితం, స్త్రీ విత్తం అధమాధమం’ అన్నారు పెద్దలు. అంచేత నా మాట విని బుద్ధిగా నీ భార్యని ఏలుకో. డబ్బుదేం వుంది, నా స్వార్జితమైన ఈ ఆస్తిని నా తదనంతరం అనుభవించవలసిన వాళ్ళు మీరేగా” స్వామి వివేకానందునిలా శాంత గంభీరస్వరంతో చెప్పాడు పరంధామయ్య.

‘ఇలాంటి నీతి సూక్తులకి నేనేం లొంగను’ అన్నట్లు ముఖం పెట్టాడు చంచ్రలావు మరింత బెట్టుగా, ఎబ్బెట్టుగా చూస్తూ.

“మీరు నాకు అలకపాన్పు మీద ఇస్తానని వాగ్దానం చేసినదే అడుగుతున్నాను మామగారు. అడగనిదే అమ్మయినా పెట్టదంటారు. మీరు పెద్దవారు. మతిమరుపు సహజం. గుర్తు చేయవలసిన బాధ్యత నాకై ఉంది.”

అల్లుడయిపోయాడుగానీ మరొకళ్లు ఎవరైనా అయితే పరంధామయ్య తిట్టిన తిట్టు తిట్టకుండా వదిలి పెట్టేవాడు కాదు. అతన్ని అమాంతం మింగె య్యాలన్నంత కోపాన్ని అణచి పెట్టుకుని పైకి ప్రశాంతంగా చూసాడు.

“ఇదేమైనా పెద్దాపురం మరిడమ్మ జాతరలో అమ్మే బొమ్మ స్కూటరనుకున్నావా నువ్వు అడిగ్గానే కొనిపెట్టడానికి. చచ్చు ముప్పై వేలయినా లేనిదే స్కూటర్ రాదు. అదీగాక ప్రభుత్వం పెట్రోలు ధర మొన్ననే పెంచింది. మళ్ళీ పెంచుతానంటోంది. నేను స్కూటర్ కొనిస్తే సరిపోతుందా? పెట్రోలు మాటేమిటి?”

“పెట్రోలు బంకున్న పెద్దమనిషి కూతుర్నే చేసుకోవాలనుకున్నాను. కర్మ కాలి మీ అమ్మాయిని చేసుకున్నాను. ఆ పాట్లన్నీ నేను పడతాను. ముందు స్కూటర్ కొనివ్వండి.”

“సాధ్యపడదు.”


“అయితే మీ అమ్మాయిని కాపురానికి తీసుకెళ్లడం నాకూ సాధ్యపడదు.”

“నా కూతురు నా దగ్గరే వుంటుంది. దానికసలు పెళ్ళే కాలేదనుకుంటాను” సహనం చచ్చిన పరంధామయ్య అన్నాడు.

‘ఈ బింకం ఎన్నాళ్లుంటుందో నేనూ చూస్తాను’ అన్నట్లు చంచ్రలావు మామగారివైపు ఒక కోర చూపు చూసి వెళ్లిపోయాడు.

లోపల నుంచి భార్య, కూతురు ఏడవడం వినిపించింది ఆయనకి.

“నోరుముయ్యి. ఎవరు చచ్చారని ఏడుపు?”



అసహాయతతో కూడిన కోపంతో అరిచాడు.

"పట్టుదలకి కూడా ఒక హద్దుంటుంది. ముప్పై వేలకోసం కక్కుర్తిపడి దాని కాపురాన్ని చెడగొడతారా? ఎలాగోలా అతను అడిగిన స్కూటర్ కొనిచ్చి మీ గౌరవాన్ని, శారద కాపురాన్ని నిలబెట్టండి'' కామాక్షమ్మ ముక్కు చీదుతూ అంది.


"ఇచ్చే వాళ్లుంటే స్కూటరేం ఖర్మ రాకెట్టే అడుగుతాడు. పెళ్లికే బోలెడు ఖర్చు పెట్టాను. నావల్లకాదు.''

"ఇవ్వలేనప్పుడు అతగాడు స్కూటర్ ఇస్తే గానీ అలకపాన్పు దిగనని భీష్మించుకుని కూర్చున్నప్పుడు ఎందుకు చెప్పలేదు.''

"అప్పుడలా అనకపోతే అతగాడు అలక పాన్పు మీదనుంచి ఇవాళ్టికీ దిగేవాడు కాదు. మొండి ఘటం! పెళ్లయిన రెండునెలలకే పెళ్లాన్ని వదిలేస్తానన్న త్రాష్టుడు. వాడు మొండి అయితే నేను జగమొండిని. వాడు మన పిల్లని వదిలేసినా ఫర్వాలేదు. నేను మాత్రం స్కూటరిచ్చేదిలేదు. ఇప్పుడు వాడి జులుంకి భయపడి స్కూటరిస్తే రేపు ఏ పండగకో కలర్ టీవీయో, రిఫ్రిజిరేటరో అడగడని గ్యారంటీ ఏమిటి?''

కామాక్షమ్మకి భర్త వాదనలో నిజం లేకపోలేదని తెలుసు. కానీ కూతురి కాపురం మూడునాళ్ళ ముచ్చట అవుతుందేమోనని ఆవిడ బాధ.

పెద్దవాళ్ళుగా కొడుకు కాపురాన్ని చక్కదిద్దవలసిన బాధ్యత వాళ్ళపై వుంది కనుక అల్లుడి ప్రవర్తన గురించి వియ్యంకుడికి






# పవర్‌ఫుల్ లేడీ

విజయశాంతి చిత్రాలంటే తెలుగు ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపిస్తారు. లేడీ అమితాబ్‌గా తెలుగు ప్రేక్షకుల్ని అలరించి, ఉత్తేజపరిచిన హీరోయిన్ విజయశాంతి. 'కర్తవ్యం', 'నేటి భారతం', 'ఓసేయ్ రాములమ్మ' తరహాలో మరో సెన్సేషనల్ చిత్రంలో ఆమె నటిస్తోంది. 'ఇందిరమ్మ' అని పేరు పెట్టిన ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తోంది. బుల్లితెర మెగా స్టార్ దివంగత అచ్యుత్ ప్రత్యేకపాత్రలో కన్పిస్తారు. ఎ.మాధవసాయి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. విజయశాంతి ఇమేజ్‌కి తగినట్టుగా ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారీ చిత్రాన్ని. పూజా భారతి, అనితా పటేల్‌లు ఆమెకి చెల్లెళ్ళుగా నటిస్తున్నారు. చాలా కాలం తరువాత వస్తున్న ఈ మాస్ చిత్రంపై విజయశాంతి అభిమానులు ఎన్నో అంచనాలతో ఉన్నారు.

–రాజా




ఉత్తరం వ్రాసాడు ఆఖరి ప్రయత్నంగా.

"మీరు పెళ్లిలో చేసిన వాగ్దానాన్ని తప్పడం మర్యాద కాదు. సాధ్యమైనంత తొందరలో స్కూటర్ కొనిచ్చి మీ అమ్మాయిని కాపురానికి పంపండి" అని వియ్యంకుడు వ్రాసిన జాబుతో హతాశులయ్యారు పరంధామయ్య దంపతులు.

"ఈ కొడుక్కి ఆ తండ్రి వత్తాసు. రెండునెలలు టైమిచ్చి దాంపత్య హక్కుల పునరుద్ధరణకి పిటిషన్ పడేస్తాను. వెధవలకి బుద్ధి వస్తుంది" అన్నాడు పరంధామయ్య కసిగా.

గదిలో నుంచి వినిపిస్తున్న కూతురు ఏడుపు ఆయన మనసుని కలచివేస్తోంది. 'కానీ తను ఈ సమయంలో బింకంగా ఉండకపోతే అల్లుడు అలుసు తీసుకుని తన నెత్తికెక్కి స్వారీ చేస్తాడు.'

ఆయన మరునాడే లాయర్‌ని కలవాలనుకున్నాడు.

ఆ ఉదయం పెరట్లో వాంతి చేసుకుంటున్న కూతురిని చూసేటప్పటికి ఆయనకి చిన్న అనుమానం వచ్చింది. రహస్యంగా భార్య దగ్గర తన అనుమానాన్ని బయటపెట్టాడు. ఆవిడ కూతుర్ని విడిగా పిలిచి అడిగింది. ఆమె చెప్పిన విషయం విని ఆవిడ గుండె గుభేల్‌మంది.

"మీ అనుమానం నిజమే. శారద నెల తప్పింది" కన్నీళ్లతో చెప్పింది.

పరంధామయ్య కాళ్లల్లో సత్తువ లేనట్టు కూలబడిపోయాడు. అసలే కూతురి కాపురం సవ్యంగా లేదు. దానికి తోడు ఆమె తల్లి కాబోతోంది. ఈ పరిస్థితుల్లో తను కోర్టుకి ఎక్కడం మంచిదా కాదా? ఆయన ద్వైదీ భావాలతో సతమతమవుతున్నాడు.

"ఏమండీ! దేనికైనా పట్టువిడుపులుండాలి. ఈ పరిస్థితుల్లో మనం ఇంకా బిగదీసుకుని కూర్చుంటే మనకే నష్టం. మన పిల్ల మనకి బరువు కాదు. కానీ దానికో పిల్లో పిల్లాడో పుట్టబోతున్నారు. దాని భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకునైనా సరైన నిర్ణయం తీసుకోండి."

పరంధామయ్య అసహాయంగా చూసాడు.

'అల్లుడిని కోర్టుకీడ్చి ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించగలడు. కానీ కూతురి భవిష్యత్తు?' రెండురోజులపాటు తీవ్రంగా ఆలోచించిన మీదట ఆయన అల్లుడడిగిన స్కూటర్‌ని కొనివ్వడానికే నిశ్చయించుకున్నాడు.

★★★

"శారద పండక్కి రాలేదేమిటమ్మా?" సరస్వతి అడిగింది.

కామాక్షమ్మ ముఖం మ్లానమయింది.

"సిడి ప్లేయర్ కొనిస్తేనే పండక్కి వస్తానని ఉత్తరం వ్రాసాడు" అంది కామాక్షమ్మ కన్నీళ్ళు పెట్టుకుంటూ.

"స్కూటర్ కొనిచ్చి రెండు నెలలు కాలేదు. ఇప్పుడు మరొకటి కావాలంటున్నాడు. వున్న డబ్బంతా వాడు అడిగిన కానుకలకి ఖర్చు పెడితే ఏ చెట్టు కిందో కూర్చోవాలి నేను. వాడు అల్లుడు కాదు. మనిషి రూపంలో వున్న జలగ. నన్ను పట్టి పీడిస్తున్న శనిగ్రహం" పళ్ళు కొరుకుతూ అన్నాడాయన మంటగా.

"పెళ్లయి ఆరునెలలు! ఎంత అన్యోన్యంగా, సరదాగా ఉండాలి వాళ్ళు. అతని ప్రవర్తనకి చిన్నబుచ్చుకుని ముఖంలో నవ్వు అనేది లేకుండా ఉంటుందది. దాని కర్మ! ఇలాంటి బాధలు పడవలసి రావడం మా కర్మ."

"మీరు సంతోషంగా ఏదిస్తే అది పుచ్చుకోక డిమాండ్ చేయడమేమిటి అసహ్యంగా" అన్నాడు శేఖరం.

"మీరతని బెదిరింపులకి భయపడకండి మామయ్యా. అతన్ని సంతోషపెట్టాలని అప్పుల పాలవకండి. మీరు ఇవ్వదలచుకున్నదే ఇవ్వండి" అన్న పెద్దల్లుడివైపు ఆర్ద్రంగా చూసాడు.

"అందరు అల్లుళ్ళూ నీలా మంచిగా ఆలోచిస్తే ఎంత బావుండునయ్యా!"

పండగ సాదాసీదగా గడిచిపోయింది. కామాక్షమ్మ శారదని తలచుకుని బాధపడుతూనే వుంది.

పండక్కి రాని శారద వున్నట్టుండి ఒకరోజు ఉదయమే సూటుకేసుతో ఇంటి ముందు రిక్షా దిగుతుంటే తెల్లబోయారు పరంధామయ్య దంపతులు.

సన్నగా పుల్లలా అయిపోయి కళ్ల కింద నల్లటి వలయాలతో వున్న ఆమెని చూస్తే మళ్ళీ అల్లుడు ఏదో డిమాండ్ చేసాడని, అది తీర్చుకోవడం కోసమే ఆమెని పుట్టింటికి పంపాడని అర్థమయింది.

"ఇలా అయిపోయావేమిటమ్మా! ఒంట్లో బాగా లేదా? వేవిళ్ళు ఎక్కువగా ఉన్నాయా?" ఆత్రతగా అడుగుతున్న తల్లిని చూసి పేలవంగా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు, అగాధాలు కనిపించాయి ఆవిడకి.

మెల్లగా కూతుర్ని అనునయించి కొంత, ఆమె ఏడుస్తూ చెప్పినదానివలన మరికొంత తెలుసుకుని స్తంభీభూతులయ్యారు.

"చంచ్రలావు దసరా పండక్కి తను అడిగిన సిడి ప్లేయర్ తెమ్మని ఆమెని వేధిస్తున్నాడు!"

కామాక్షమ్మ నిస్సహాయతతో కూడిన కోపంతో వణికిపోయింది.

"స్కూటర్ కొని నాలుగునెలలైనా కాలేదు. ఇప్పుడు సిడి ప్లేయర్ కావాలా? ఇదయ్యాక మళ్ళీ సంక్రాంతి వస్తుంది. అప్పుడు మరకొటి అడగడని గ్యారంటీ ఏమిటి? మీ నాన్న కోటీశ్వరుడు అనుకుంటున్నాడా అతను? పెళ్ళికి బోలెడు ఖర్చు పెట్టాం. మళ్ళీ పురుడికి, బారసాలకి ఎంతవుతుందో? మీ నాన్న సంపాదించిన ఈ ఇల్లు, బ్యాంకులో వున్న డబ్బు మా తదనంతరం మీకే కదా. ఇప్పుడే ఇచ్చేయమంటే మా బతుకులేం కావాలి?"

"మీ నాన్నని సిడి ప్లేయర్ అడిగి పట్రా అన్నారు. మావాళ్ళు పసుపు కుంకుమల రూపేణా ఇచ్చినది సంతోషంగా పుచ్చుకుంటాను తప్ప డిమాండ్ చేయనని తెగేసి చెప్పాను. నన్ను...నన్ను కొట్టారమ్మా" శారద ఏడుస్తోంది.

"వీడి చేతులు విరిగిపోను. కడుపుతో వున్నావనైనా ఆలోచించకుండా నిన్ను కొడతాడా? నువ్వసలు కాపురానికి వెళ్లొద్దు. డబ్బే ముఖ్యమనుకునే అలాంటి నీచులతో కలసి ఉండొద్దు" ఆవేశంగా అంది కామాక్షమ్మ.

పరంధామయ్య సత్తువ లేనట్టు కూర్చున్నాడు. భార్య ఆవేశంలో ఆ మాటలు అంటోందని, మనసులో కూతురి కాపురాన్ని ఎలా చక్కదిద్దాలా అని ఆలోచిస్తూ వుంటుందని ఆయనకి తెలుసు.

ఆయన ఊహని నిజంచేస్తూ ఆ రాత్రే అంది కామాక్షమ్మ.

"ఒకసారి అల్లుడి జాతకాన్ని సిద్ధాంతిగారికి చూపిస్తాను."

"ఎందుకు?"

"ఆ మొండితనం, మంకుతనం పోవడానికి ఏవైనా పూజలవీ చేయించాలేమో!"

"అల్లుడిని దారిలో పెట్టడానికి ఏ పూజ చేయాలో నాకు బాగా తెలుసు."

"తెలుసా? ఏ పూజ?"

"బడిత పూజ!"

"చాల్లేండి వేళాకోళం!" చిరాగ్గా అంది.

"నిజం కామాక్షీ! అల్లుడయిపోయాడుగానీ లేకపోతే వాడికి ఎలా గుణపాఠం చెప్పాలో నాకు తెలుసు. నేను తీవ్రంగా రియాక్టయితే అమ్మాయి కాపురం ముక్కలయిపోతుంది. అందుకే ఆలోచిస్తున్నాను" అన్నాడు పరంధామయ్య.

★★★

వారంరోజుల తరువాత పెద్దల్లుడి దగ్గరనుండి వచ్చిన ఉత్తరాన్ని చదివిన ఆయనకి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ప్రతిసారీ మేము మీ ఇంటికి రావడమేకానీ ఒక్కసారైనా మీరు మా ఇంటికి రాలేదు. నేను మీకేమీ చెయ్యలేకపోయాననే బాధ నా గుండెని దొలుస్తోంది. శారదకి కూడా కొంచెం మార్పు అవసరం. కాబట్టి మీరు, అత్తయ్యగారు, శారద హైదరాబాద్ వచ్చి మా దగ్గర కొన్నాళ్లుండండి. నా ఈ చిన్న కోరికను మన్నిస్తారని ఆశిస్తున్నాను."

శేఖరం వ్రాసిన ఉత్తరం తాలూకు సారాంశమది.

"అమ్మా శారదా! బట్టలు సర్దుకో" కూతురితో చెప్పాడు.

"సిడి ప్లేయర్ కొనడానికి నిర్ణయించుకున్నారా?" కామాక్షమ్మ అడిగింది.

"మనం అల్లుడిని, అమ్మాయిని తీసుకుని హైదరాబాద్ వెళ్తున్నాం."

"ఎందుకూ?" అర్థంకాక అడిగింది.

"శేఖరం మనని హైదరాబాద్‌కు రమ్మని ఉత్తరం వ్రాసాడు. చంచ్రలావుని కూడా మనతో రమ్మని ఉత్తరం వ్రాస్తాను. తనకంటే తక్కువ జీతం తెచ్చుకుంటున్న మన పెద్దల్లుడు జాగ్రత్తగా ఖర్చు పెట్టుకుంటూ సంసారానికి కావలసివన్నీ కొనుక్కుంటూ ఎంత దర్జాగా గడుపుతున్నాడో చూపిస్తాను. అతను స్కూటర్ కొనుక్కుంటానన్నప్పుడు నేను డబ్బు ఇస్తానన్నా పుచ్చుకోకుండా ఇన్‌స్టాల్‌మెంట్స్‌మీద కొనుక్కున్న అతని స్వాభిమానాన్ని చంచ్రలావుకి ఆదర్శంగా చూపిస్తాను."


"ఏమిటో మీ పిచ్చిగానీ నక్కలు ఊళ పెట్టడం మాని గౌరీ కళ్యాణాన్ని పాడతాయా?" దిగులుగా నిట్టూర్చింది.

"చూద్దాం! మన ప్రయత్నం మనమూ చేయాలిగా!"

★★★

తనని హైదరాబాద్ రమ్మని పిలుస్తున్న మామగారి ఎత్తుగడ ఏమిటో చంచ్రలావుకి అర్థంకాలేదు. సిడి ప్లేయర్ కొనమన్న తన డిమాండ్‌ను అటకెక్కించి హైదరాబాద్ రమ్మంటున్నాడేమిటి అనుకున్నాడు. కొరకరాని కొయ్యలాంటి మామగారిని ఎలా ఎదుర్కోవాలో ఇదివరకే ప్లాన్ చేసాడు. దానికి తల్లీదండ్రీ మెరుగులు దిద్దారు.

"జాగ్రత్త ఒరేయ్! మీ మామ అసాధ్యుడు. నిన్ను హైదరాబాద్





## బ్రతికి ఉండగానే...

భర్త బ్రతికి ఉండగానే చచ్చిపోయాడని నమ్మించిన తమ చిన్నల్లుడు కోటేశ్వరరావుపై మండిపడుతోంది శ్యామల. ఏడాది క్రితం రాఘవులనే వ్యక్తి ఇంట్లోంచి పారిపోవడంతో పెన్షన్ డబ్బులకు ఆశపడిన చిన్న అల్లుడు తన మామగారు చనిపోయాడని అత్తని నమ్మించి అతనికి వచ్చే పెన్షన్ డబ్బులను కాజేస్తున్నాడు. ఆ ఊరి ఎమ్ఆర్వో కూడా రాఘవులు చనిపోయాడని నమ్మి డెత్ సర్టిఫికెట్ ఇవ్వడంతో శ్యామల కూడా భర్త చనిపోయాడని నమ్మింది.

మన ప్రభుత్వ కార్యాలయాల పని తీరు ఎంత అధ్వాన్నంగా వుందో తెలియడానికి ఇది ఒక చిన్న ఉదాహరణ.

— శశి







## సుఖం

''జైలరుగారూ! ఎప్పుడూ ఇక్కడే ఉంటారే! ఇంటికి వెళ్లరా!'' అడిగాడో ఖైదీ.

''ఇంటి దగ్గర ఈ జైలరుకో జైల రుంది నాయనా. అక్కడికి వెళ్లడం కన్నా ఇక్కడే సుఖంగా వుంది.''

**–కలవకుంట్ల గురునాథపిళ్లై** (మదనపల్లె)

## మంచి పని

''ప్రతిరోజూ ఒక మంచి పని చేయాలని నిన్న చెప్పాను కదా శ్రీనూ. ఇవాళ నీవేం మంచి పని చేసావు?'' అడిగింది టీచర్.

''మేం నలుగురం ఒక వృద్ధురాలిని రోడ్డు దాటించాం టీచర్'' గర్వంగా చెప్పాడు శ్రీను.

''ఆ పనికి నలుగురెందుకు?''


''ఆమె దాటేందుకు మొరాయించింది అందుకని.''


## మందు

''ఏంటీ! నాటుమందు కొట్టి ఆఫీసుకు వస్తున్నావట'' సీరియస్‌గా ప్రశ్నించాడు మేనేజరు.

''ఆ ఇంక్రిమెంటేదో తమరు ఇప్పిస్తే కంపెనీ సరుకే పుచ్చుకుంటానం డయ్యా'' చెప్పాడు అటెండర్.

**– భూక్యా గోపీనాయక్** (చిలకలూరిపేట)






ఎందుకు రమ్మంటున్నాడో?'' అంది చంచల్రావు తల్లి హెచ్చరికగా.

''అదీ చూద్దాం'' అన్నాడు.

★★★

''ఉన్నట్టుండి హైదరాబాద్ ప్రయాణమేమిటి?'' అడిగాడు చంచల్రావు దారిలో.

''మా పెద్ద అల్లుడు మమ్మల్ని రమ్మని పిలిచాడు. నిన్ను వదిలి అమ్మాయిని ఒక్కర్తినీ ఎలా తీసుకెళ్లనోయ్!''

''ఓహో!'' అన్నాడు.

★★★

శేఖరం, సరస్వతి ఆదరంగా ఆహ్వానించారు వీళ్ళని. స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ తిన్నారు.

వాషింగ్ మిషన్‌లో బట్టలు వేస్తున్న సరస్వతిని అడిగాడు పరంధామయ్య.

''వాషింగ్‌మెషిన్ బాగుందమ్మా! ఎంత యింది?''

''ఏడువేల చిల్లర అయింది నాన్నా. ఇన్‌స్టాల్ మెంట్స్‌లో కొన్నాం. నెలకు ఆరువందలు కట్టాలి!''

''నన్ను అడిగితే నేను డబ్బు సర్దుబాటు చేసేవాడినిగా!''

''ఆయనకి ఇష్టం ఉండదు నాన్నా!''

''అప్పుగానే కదమ్మా!''

''అయినా సరే. ఆయనకి ఇష్టం ఉండదు నాన్నా!''

ఓరగా చంచల్రావు ముఖంలోకి చూసాడు పరంధామయ్య.

'ఇలా నరుక్కొస్తున్నావా మామా!' అన్నట్టు చూసాడు.

భోజనాలయ్యాక శేఖరం అత్తమామలతోపాటు తోడల్లుడికి, మరదలికి కొత్త బట్టలు పెట్టించాడు భార్య చేత.

తనకి పాదాభివందనం చేసిన పెద్దకూతురిని, అల్లుడిని మనస్ఫూర్తిగా దీవించారు పరంధామయ్య దంపతులు.

''సిడి ప్లేయర్ సంగతేం చేసారు?'' అడిగాడు చంచల్రావు నిర్మొహమాటంగా.

క్షణకాలం ఆ గదిలో గాలి గడ్డ కట్టింది. అతను అంత నిక్కచ్చిగా ముఖం మీదే అడుగుతాడని ఊహించని పరంధామయ్య దిమ్మెరపోయాడు.

''దసరాకి నేను అడిగిన సిడి ప్లేయర్ ఇవాళ్టి దాకా కొనలేదు మీరు. వచ్చే నెలలో సంక్రాంతి వస్తోంది.''

అతని మాటల్లో సంక్రాంతికి మరేదో కావాలనే వార్నింగ్ వినిపించింది పరంధామయ్యకి. క్షణాలలో తేరుకుని అన్నాడు.

''చూడు బాబూ! నా దగ్గర లక్షలకి లక్షలు డబ్బు మూలుగుతోందని, నువ్వడగ్గానే వేలకివేలు ఖరీదైన బహుమతులిస్తానని అపోహ పడుతున్నావేమో!

నా దగ్గర డబ్బుంది నిజమేకానీ లక్షాధికారిని కాను. అవసరాలని తీర్చుకోవడానికి సరిపడే డబ్బుంది. కానీ అనవసరపు భేషజాలకి పోవడానికి కాదు.

నీకు సిడి ప్లేయర్ కావాలంటే ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనుక్కో. నీ తోడల్లుడికి నీకంటే తక్కువ జీతం. పెద్ద సిటీలో కాపురం వుంటున్నాడు. అయినా ఎప్పుడూ ఒక్క రూపాయి కూడా నన్ను డగలేదే. వున్నంతలో పొదుపుగా ఖర్చు పెట్టుకుంటూ సంసారానికి అవసరమైనవన్నీ కొనుక్కుంటున్నాడు. అతనికంటే జీతం ఎక్కువే వస్తున్న నువ్వు ఇంకా దర్జాగా బ్రతగ్గలవు. శేఖరాన్ని చూసయినా నీలో మార్పు వస్తుందనే ఆశతో నేను నిన్ను ఇక్కడకు తీసుకొచ్చాను''

మెల్లగా అయినా స్పష్టంగా, ఖచ్చితంగా చెప్పిన మామగారి మాటలకి చంచల్రావు ముఖం అందరూ ఆశించినట్టుగా ఎర్రబడలేదు. ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

★★★

సాయంకాలం చంచల్రావుని శేఖరం పిలిచాడు.

''అలా టాంక్‌బండ్‌దాకా వెళ్లొద్దాం పదండి.''

''సరే'' అన్నాడు.

ఇద్దరూ స్కూటర్‌పై బయలుదేరారు.

''మీతో కొంచెం మాట్లాడాలి.''

''మాట్లాడండి.''

''మీరు మామగారిని ఖరీదైన కానుకలిమ్మని డిమాండ్ చేస్తున్నారుట. మనం చదువుకున్న వాళ్ళం. జన్మతః వచ్చిన సంస్కారాన్ని చదువుతో మెరుగులు దిద్దుకోవలసివాళ్ళం.

అత్తవారిచ్చే కానుకల కోసం ఆశించడం, అవి తీసుకుని రమ్మని భార్యని హింసించడం ఎంతవరకు సమంజసం? మనకి వున్న దానితో తృప్తిపడాలి.''

'అయిందా నీ ఉపన్యాసం?' అన్నట్లు చూస్తూ నవ్వేడు చంచల్రావు.

''ఈ స్కూటర్ మీరే కొనుక్కున్నారా?''

అతను ఈ ప్రశ్న ఎందుకడుగుతున్నాడో శేఖరానికి అర్థంకాలేదు.

"అవును. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనుక్కున్నాను."

"కానీ నేను స్కూటర్ మామగారిచేత కొనిపించుకున్నాను."

"ఆ... కొనిపించుకున్నారు. అలకపాన్పు మీద మీరడిగారు.

ఆయన నోరు జారి సరేనన్నారు. ఆయన స్కూటర్ కొనలేనందుకు పెళ్ళయి రెండునెలలు తిరక్కుండానే శారద పుట్టింటికి పంపేసి వాళ్ళని బెదిరించి..."

"నేను అనుసరించిన మార్గం మీకు తప్పుగా అనిపించవచ్చు. కానీ నేను ఆమాత్రం బెట్టు చూపించకపోతే ఆయన ఈ జన్మలో స్కూటర్ కాదు కదా టాయ్ స్కూటర్ కూడా కొనివ్వడు. మన మామగారికి మీ భార్య, నా భార్య ఇద్దరే ఆడపిల్లలు.

ఆయన సంపాదించినది వాళ్లిద్దరికే అని చెబుతూనే మనకిచ్చే కానుకలని ఎంత చౌకగా తేల్చేయాలా అని ఆలోచిస్తాడు. ఎప్పుడో ఆయన తదనంతరం వచ్చే డబ్బు కోసం నోట్లో వేలు వేసుకుని కూర్చుని ఎదురు చూసి చూసి మనం ముసలివాళ్ళమైపోతాం. నిజంగా ఆ డబ్బు చేతికి వచ్చే టైముకి అనుభవించడానికి వయసు వుండదు మనకి."

"అందుకని ఆయనని కాబూలీవాడిలా పీడిస్తారన్నమాట!"

"మిమ్మల్ని చూస్తే జాలి వేస్తోందన్నయ్యగారూ! మీ మంచితనాన్ని చవటతనంగా లోకువ కట్టి మామగారు మీకు చవగ్గా కానుకలనిచ్చి వదిలించుకుంటున్నారు.

జీతంలో నాలుగో వంతు ఇన్‌స్టాల్‌మెంట్స్‌కి కట్టేసి మిగిలిన డబ్బుతో నెలంతా ఎలా గడపాలా అని దిక్కులు చూస్తున్నారు మీరు. పోనీ నేను మామగారిని కానుకల కోసం పీడించే నికృష్టుడినే. కానీ ఆయన మిమ్మల్ని ఒకలాగ, నన్నొకలాగ చూడ్డమేమిటి?

మీ మంచితనానికి ముగ్ధులై మీక్కూడా నాతో పాటు సమానమైన కానుకలు ఇవ్వవచ్చుగా! మీకు అయిదొందలు పెట్టి బట్టలు, నాకు ముప్పై వేలు పెట్టి స్కూటర్!"

శేఖరానికి ఎక్కడ తగలాలో అక్కడ తగిలాయా మాటలు. అతని ముఖం నల్లబడింది. అతని ముఖంలో తను ఆశించిన మార్పు కనబడగానే చంచ్రావు రెచ్చిపోయాడు.

"మీకు భార్యని అపురూపంగా చూసుకునే బుద్ధిమంతుడని, మామగారు ఏమిస్తే అది పుచ్చుకునే నీతిమంతుడనే పేరు వస్తే రావచ్చుగాక! కానీ మీ పెళ్ళయిన నాలుగేళ్ళల్లోనూ మీరేం సంపాదించగలిగారు? నన్నే చూడండి! పెళ్లయి రెండునెలలు తిరక్కుండానే స్కూటర్! ఇప్పుడు సిడి ప్లేయర్ కొనిస్తే తప్ప శారదని ఏలుకోను. విజయవాడలో నా భార్యని కొడితే అనకాపల్లిలో వున్న మామగారికి కన్నీళ్ళు రావాలి!"

తన మాటలు ఎంతటి సంచలనాన్ని కలిగించాయో శేఖరం ముఖం చూస్తే అర్థమయింది చంచ్రావుకి.

ఆ రాత్రి శేఖరానికి నిద్ర పట్టలేదు. పదే పదే తోడల్లుడి మాటలు గుర్తుకు రాసాగాయి.

'నిజమే! తన మంచితనం మామగారి దృష్టిలో చవటతనంగానే కనిపిస్తోంది. లేకపోతే తనకి ముష్టి అయిదు వందలు పెట్టి బట్టలుకొని చిన్నల్లుడికి స్కూటర్ కొనిస్తాడా? చూపిస్తాను నా తడాఖా!' పళ్ళు కొరుక్కున్నాడు.

★★★

పరంధామయ్య కుటుంబం హైదరాబాద్ నుంచి అనకాపల్లి తిరిగి వచ్చిన పదిరోజుల తరువాత...

సరస్వతి మూడేళ్ళ పసివాడితో చేతిలో సూట్‌కేసుతో ఆ ఇంటి ముందు ఆటో దిగింది.

హఠాత్తుగా వచ్చిన కూతురిని చూసి ఆశ్చర్యపోయి తరువాత ఆనందంగా ఆహ్వానించాడు పరంధామయ్య.

"నువ్వు ఒక్కర్తివీ వచ్చావేమిటమ్మా? అల్లుడేడి?"


సమాధానంగా సరస్వతి బావురుమంది.

"మిమ్మల్ని అడిగి ముప్పైవేల రూపాయలు తెస్తేనే నన్ను కాపురానికి రమ్మన్నారు నాన్నా మీ అల్లుడు" అని ఏడుస్తున్న కూతురిని చూసి నిర్ఘాంతపోయాడు పరంధామయ్య.

పెద్దల్లుడిని చూసి చిన్నల్లుడిలో మార్పు వస్తుందని ఆశించాడు. కానీ చిన్నల్లుడిని చూసి పెద్దల్లుడే మారిపోయాడా?

అల్లుడిని దశమగ్రహం అని ఎందుకు అంటారో అర్థమయిందాయనకి. చిక్కు సమస్యలుగా మారిన కూతుళ్ల కాపురాలని ఎలా చక్కదిద్దాలా అని నిస్సహాగా కూలబడిపోయాడు పరంధామయ్య.

★



## మోడ్రన్ గర్ల్

కొంతమంది సినీతారలు సహజంగానే అందంగా ఉంటారు. ప్రేక్షకుల్ని కట్టిపడేయాలంటే తమకున్న అందానికి కాసిన్ని మెరుగులు దిద్దుకోవాల్సిందే. తన అందచందాలతో నిత్యం అలరించే తార శిల్పాశెట్టి. కాలానుగుణంగా ఆరోగ్య నియమాల్ని పాటిస్తూ తన అందాన్ని కాపాడుకుంటూ ఉంటుంది తార. డ్రెస్‌సెన్స్ బాగా తెలిసిన శిల్పా ఎప్పుడూ మోడ్రన్ గర్ల్‌గా కనిపిస్తూ ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ఈ విషయాన్నే ఆమెని అడిగితే ఆ క్రెడిట్ అంతా తన తల్లిదే అంటోంది. తామేం సాధించినా తమ ఉన్నతికి తల్లే కారణం అంటూ చెప్పడం మామూలే అయినా శిల్పా తన తల్లిపట్ల చూపించే ప్రేమలో నిజాయితీ కన్పిస్తుంది. అలాగే శిల్పా అంటే ఆమె తల్లికి ఎంతో ప్రాణమట. కూతురి ఉన్నతిని చూసి ఆమె ఎంతో సంతోషపడుతోంది.

– రాజా

